www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 19 డిసెంబర్ 2023

సమ్మె 'ఒడి'లో 'అమ్మ'లు..!

అంగన్‌వాడీలు సమ్మె ప్రారంభించి ఏడో రోజూ కొనసాగుతోంది.. రోజురోజుకీ పలు పార్టీల, ప్రజాసంఘాల మద్దతు వీరికి లభిస్తోంది. ఏడోరోజు సోమవారం సబ్‌కలెక్టరేట్లు, ఆర్డీవో కార్యాలయాలు వేలాదిమంది అంగన్‌వాడీలతో దద్దరిల్లాయి. వేతనం పెంచేంత వరకూ సమ్మె ఆపేది లేదని, 'అమ్మఒడి' లేకనే సమ్మె'ఒడి' చేపట్టామన్నారు. ఓ వైపు వేతనాల పేరిట సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని, మరోవైపు నిత్యావసర ధరలు పెరిగి ఇచ్చే వేతనాలు ఓ మూలకు చాలడం లేదని మండిపడ్డారు.

- పెరుగుతున్న ప్రజాసంఘాల మద్దతు
- ఏడోరోజు దద్దరిల్లిన ఆర్డీవో కేంద్రాలు
- వేలాదిగా తరలివచ్చిన అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, చిత్తూరు అర్బన్, యంత్రాంగం

తిరుపతి ఆర్డీవో కార్యాలయం వద్ద పెద్దఎత్తున మహాధర్నా జరిగింది. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు, యూనియన్ జిల్లా కార్యదర్శి వాణిశ్రీ, డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.జయచంద్ర, ఐద్వా జిల్లా కార్యదర్శి డాక్టర్ పి.సాయిలక్ష్మి, జిల్లా నాయకులు టి.సుబ్రమణ్యం, లక్ష్మీ, బుజ్జి, వెంకటేష్, మురళి, ప్రత్యేక రాయలసీమ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు కూరపాటి సురేష్ తదితరులు సంఘీభావం ప్రకటించారు. ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం రోడ్లపై భిక్షాటన చేస్తూ తాము ఎందుకు సమ్మె చేస్తున్నామో అందరికీ వివరించే ప్రయత్నం చేశారు. ఈ కార్యక్రమంలో విజయకుమారి, నాగభూషణమ్మ, లీల, నాగరాజమ్మ, ప్రియదర్శిని పాల్గొన్నారు.

✦ గూడూరు ఆర్డీవో కార్యాలయం గూడూరు, వెంకటగిరి, కోట ప్రాజెక్టుల నుంచి వెయ్యిమందికి పైగా అంగన్‌వాడీ కార్యకర్తలు నినాదాలతో దద్దరిల్లింది. ఆర్డీవో కిరణ్‌కుమార్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం నేతృత్వం వహించారు. కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్ సంఘీభావం ప్రకటిస్తూ ప్రాథమిక పాఠశాలలో టీచర్లకు ఎంత వేతనం ఇస్తున్నారో అంత వేతనం అంగన్‌వాడీలకు ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ నాయకులు పంటా శ్రీనివాసులురెడ్డి, సిఐటియు నాయకులు జోగి శివకుమార్, బివి రమణయ్య, అంగన్‌వాడీ జిల్లా అధ్యక్షురాలు పద్మలీల, రూరల్ ఇంద్రావతి, స్వరూపరాణి, మంజుల, సుభాషిణి, విజయమ్మ, కుమారి, ఆసియా, మంగమ్మ, సుబ్బమ్మ పాల్గొన్నారు.

గూడూరు ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తూ...

✦ శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాలయం వద్ద వెయ్యిమంది పైగా అంగన్‌వాడీలు మెరుపు సమ్మెకు దిగారు. వన్‌టౌన్‌పోలీసులు భారీగా మోహరించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య, ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు రామిశెట్టి వెంకయ్య సంఘీభావం తెలిపారు. అమ్మ పాత్ర పోషిస్తున్న అంగన్‌వాడీల పట్ల జగన్‌ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు శోచనీయమన్నారు.

✦ సూళ్లూరుపేటలో ఆర్డీవో కార్యాలయం ఆవరణలో మహాధర్నా జరిగింది. 600మంది అంగన్‌వాడీలు పాల్గొన్నారు. సిపిఎం నాయకులు జనార్ధన్, అంగన్‌వాడీ క్లస్టర్ నాయకురాలు మేకల హైమావతి, సిఐటియు నాయకులు రమణయ్య, కె.లక్ష్మయ్య, టిడిపి నాయకురాలు బుద్ధి విజయలక్ష్మి సంఘీభావం ప్రకటించారు.

✦ బిఎన్ కండ్రిగ ఎంపిడిఒ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు కళ్లకు గంతలు కట్టుకుని నిరవధిక సమ్మెలో పాల్గొన్నారు. నాయకులు శోభ, కె.సుదర్శన నాయకత్వం వహించారు.

✦ రేణిగుంటలో మంచినీళ్లగుంట పాత తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కొనసాగింది. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు 150 మంది శిబిరంలో పాల్గొని నిరసన తెలిపారని ప్రాజెక్టు అధ్యక్షురాలు ధనమ్మ తెలిపారు. టిడిపి పట్టణాధ్యక్షులు మహబూబ్‌బాష నాయకత్వంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు అన్నదానం చేశారు. సిఐటియు నాయకులు హరినాథ్, వెంకటరమణ, సెల్వరాజ్ పాల్గొని మద్దతు తెలిపారు.

✦ పాకాలలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి పత్తిపాటి రమేష్‌నాయుడు ఓ ప్రకటనలో సంఘీభావం తెలిపారు.

✦ వెంకటగిరిలో ఐఎఫ్‌టియు రాష్ట్ర గౌరవాధ్యక్షులు హరికృష్ణ సంఘీభావం ప్రకటించారు.

✦ నగరిలో యూనియన్ నాయకులు ధనకోటి, మునెమ్మ, ఉమ ఆధ్వర్యంలో సమ్మె కొనసాగింది. ఎఐటియుసి, సిఐటియు, ఎఫ్ఐటియు నాయకులు కోదండయ్య, సురేంద్ర, సురేందర్‌నాథ్ సంఘీభావం తెలిపారు. నగరి ఆర్డీవోకు వినతిత్రం సమర్పించారు.

పోరాటాల ద్వారానే హక్కులుసాధించుకుద్దాం : నరసింహారావు

చిత్తూరుఅర్బన్: సమ్మెలో ఉన్న అంగన్వాడీలను బెదిరింపులకు పాల్పడుతూ ప్రభుత్వం అత్యంత దుర్మార్గంగా వ్యవహరించడాన్ని నిరశిస్తూ సోమవారం చిత్తూరు, గుడిపాల, యాదమరి, చిత్తూరు రూరల్ ప్రాజెక్టుల అంగన్వాడీలు చిత్తూరు ఆర్‌డిఒ కార్యాలయం ఎదట ధర్నా చేశారు. విన్నూత రీతిలో గ్రామ దేవత అమ్మోరు పూనినట్లుగా వేపాకులతో అంగన్వాడీలు నిరసన వ్యక్తం చేశారు. పోరాటాలను అణచివేయడం సాధ్యంకాదని గత అనుభాలు తెలియజేస్తున్నాయని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి నరసింహారావు అన్నారు. అంగన్వాడీల ధర్నాకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీల పోరాట పటిమ ఏపాటిదో తెలిసిందేనన్నారు. సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. అంగన్వాడీల ఫోరాటానికి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు హేమలత మద్దతు ప్రకటించారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరించకుండా అంగన్వాడీల సమస్యలపై సానుకూలంగా స్పందించి పరిష్కరించాలన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు చైతన్య, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి షకిలా, అంగన్వాడీ అసోషియేషన్ నాయకులు ప్రభావతి, అంగన్వాడీ యూనియన్ నాయకులు సృజని, మమత, బుజ్జి, శశికళ, ఆటో యూనియన్ నాయకులు ప్రసాద్‌లతో పాటు వందలాంది మంది అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.



నగరిలో నిరసన

చేతి కష్టమే రైతుకు ఆస్తి..
ఏనుగుల దాడిలో నష్టమే జాస్తి.!

- రాగిమానుపెంటలో ఏనుగులు హల్‌చల్
- పంటలపై కొనసాగుతున్న దాడులు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: చేతికొచ్చే పంటలు ఏనుగుల దాడిలో ధ్వంసం అవుతుండటం పట్ల రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. అప్పులు చేసి.. కష్టించి పండించిన పొలం చేతికందే సమయంలో ఏనుగులు దాడి చేస్తుండటంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లోని పంట పొలాల్లో ఏనుగుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. ఆదివారం రాత్రి మండలంలోని రాగిమానుపెంట గ్రామంలో ఏనుగులు పంటలపై పడి ధ్వంసం చేశాయని రైతు హుస్సేన్ తెలిపారు. పంట చేతికొచ్చే దశలో ఏనుగుల గుంపు ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఇప్పటికే గ్రామాల్లో చాలా మంది రైతులు వ్యవసాయాన్ని మానుకున్నారని తనకు జరిగిన నష్టం కూడా అలాంటిదేనన్నారు. ఇలా ఏనుగులు పంటలపై పడి నాశనం చేస్తుంటే అధికారులైనా ప్రత్యాన్మాయ చర్యలు తీసుకోకుంటే ఎలా అన్ని ప్రశ్నించారు. ఇకనైనా ఏనుగులను నియంత్రించి అడవుల్లోకి పంపే ప్రయత్నం చేయాల్సి ఉందన్నారు. ప్రభుత్వం నష్ట పరిహారం అందజేయాలని కోరారు.

ఆరోగ్యశ్రీ.. పేదలందరికీ వరం

- వైద్య ఖర్చు పరిమితి రూ.25లక్షలకు పెంపు
- గడిచిన నాలుగేళ్లుగా జిల్లాలో రూ.635కోట్లతో 33లక్షల మందికి పథకం వర్తింపజేశాం
- ఆరోగ్య ఆసరా ద్వారా రూ.62కోట్ల ఖర్చుతో లక్ష30వేల మందికి అందించాం
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వెల్లడి

మెగా చెక్కును అందిస్తున్న మంత్రి

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్య ఖర్చు పరిమితి రూ.25లక్షలకు పెంచుతున్నట్లు మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం వెలగపూడి సిఎం క్యాంప్ కార్యాలయం నుండి ముఖ్యమంత్రి మెగా ఆరోగ్యశ్రీ అవగాహన కార్యక్రమాన్ని వర్చువల్‌గా ప్రారంభించారు. జిల్లా సచివాలయం నుంచి మంత్రితో పాటు జెడ్పి ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ ఎస్.షణ్మోహన్, ఎస్.పి రిషాంత్‌రెడ్డి, నగర మేయర్ అముద, చిత్తూరు ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, రాష్ట్ర ఈడిగ కార్పొరేషన్ చైర్ పర్సన్ కెజె.శాంతిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో జబ్బులతో బాధపడుతున్న పేద, మధ్య తరగతి వారికి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఏపీతో పాటు పొరుగు రాష్ట్రాలలోనూ కార్పొరేట్ ఆసుపత్రులలో దాదాపు 3200 జబ్బులకు ఉచిత వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఉన్న వైద్య ఖర్చు పరిమితి రూ.25 లక్షల వరకు పెంచిందని, ఈ పథకం పేద వారికి సీఎం అందించిన వరం అన్నారు. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు ఉచితమైన వైద్యం అందించడం జరుగుతున్నదన్నారు. ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా ద్వారా రాష్ట్రంలో ప్రతి ఏడాది దాదాపు రూ.4,100 కోట్లు ఖర్చు చేయడం జరుగుతున్నదన్నారు. నాడు-నేడుతో ఆసుపత్రులను ఆధునీకరణ, వైద్య సిబ్బంది, పారా మెడికల్ సిబ్బంది, సూపర్ స్పెషాలిటీ వైద్యులను నియమించడం, ప్రతి జిల్లాకు ఒక వైద్య కళాశాల ఏర్పాటు, వైద్య కళాశాలలో రిసెర్చ్ సెంటర్‌లను ఏర్పాట్లు చేసుకోవడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఉన్న 11 మెడికల్ కళాశాలల ఆధునీకరణ, నిర్మాణంలో ఉన్న 17 మెడికల్ కళాశాల నిర్మాణపు ఖర్చులు మొత్తం రూ.32,279 ఖర్చు చేశారన్నారు. ఆరోగ్య సురక్ష మొదటి విడతలో రాష్ట్ర వ్యాప్తంగా అత్యధిక వైద్య పరీక్షలు చేసిన జిల్లాల్లో చిత్తూరు జిల్లా ప్రథమ స్థానంలో ఉందన్నారు. 2024 జనవరి 2 నుండి ప్రారంభం కానున్న రెండవ విడత కార్యక్రమంను అదే స్థాయిలో నిర్వహించి ప్రథమ స్థానంలో నిలపడానికి కృషి చేస్తామన్నారు. జిల్లాలో గత నాలుగున్నర సంవత్సర కాలంలో దాదాపు 33,20,000 మందికి ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం అందించుటకు రూ.635 కోట్లు, శస్త్ర చికిత్స అనంతరం అందించే ఆరోగ్య ఆసరా ద్వారా 1,30,000 మందికి రూ.62 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. జిల్లాలో 4,73,877 ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరు చేశామని, 77 నెట్ వర్క్ ఆసుపత్రులు ఉన్నాయని తెలిపారు. రెండవ విడత ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డిఎంహెచ్ఓ డా.ప్రభావతి దేవి, జెడ్పి సిఈఓ ప్రభాకర్ రెడ్డి, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డా.సుదర్శన్, డిపిఓ లక్ష్మి, డిఐఓ డా.రవిరాజు, చిత్తూరు జిల్లా ప్రధాన ఆసుపత్రి సూపరిండెంట్ డా.అరుణ్ కుమార్, సంబంధింత అధికారులు, కార్పొరేటర్ హరిణి రెడ్డి, ప్రజా ప్రతినిధులు, పాల్గొన్నారు.

20 నుంచి మండల స్థాయిలో గణిత అవధానం

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ మ్యాథ్స్ ఫోరం, జన విజ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యంలో మండలస్థాయి గణిత అవధానం నిర్వహించనున్నట్లు ఫోరం ప్రతినిధులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. భారతదేశ చరిత్రలో మొట్టమొదటిసారిగా గణిత అవధాన కార్యక్రమాలను 13 పాఠశాలల్లో 29 మంది విద్యార్థులచే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అవధాన గురువు, ఆంధ్రప్రదేశ్ మ్యాథ్స్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు, జన విజ్ఞాన వేదిక జిల్లా విద్యా విభాగం కన్వీనర్ హెచ్.అరుణ శివప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈనెల 20వ తేదీన గంగాధర నెల్లూరు మండలం పెడకంటిపల్లి ఉన్నత పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న విద్యార్థులు లువంతి, దిశషితలచే పాపుదేశి ఫౌండేషన్ సహకారంతో అవధాన కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. ఏకకాలంలో ఇంతమంది విద్యార్థులచే అవధానం నిర్వహించడం చాలా గొప్ప విషయమని జనవిజ్ఞాన వేదిక పర్యావరణ విభాగం కన్వీనర్ జి.సుధాకర్ తెలిపారు.

పోలీస్ స్పందనకు 31 ఫిర్యాదులు

అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్ ఎస్పీ

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎల్. సుధాకర్, ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మి ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో 31 ఫిర్యాదులు అందగా తక్షణమే విడియో కాన్ఫరెన్స్ ద్వారా బాధితులకు పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

గ్రామీణ పాలనలో నూతన ఒరవడి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పరిషత్ ఛైర్మన్

- ఏ రాష్ట్రంలో సాధ్యంకాని సంక్షేమం ఏపీలో అమలైంది
- జెడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: వైసీపీ ప్రభుత్వంలో గ్రామీణ పాలనలో నూతన ఒరవడి సంతరించుకున్నదని జెడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు అన్నారు. సోమవారం చిత్తూరు సీఎంఎస్ఎస్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులకు నాలుగు రోజులు పాటు డిజిటలైజేషన్, సుస్థిరాభివృద్ధి, సర్వీస్ రూల్స్ గురించి నిర్వహించే సదస్సును జెడ్పీ ఛైర్మన్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, డిఎల్‌డిఓ రవికుమార్‌లతో కలిసి ప్రారంభించారు. జెడ్పి ఛైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి లక్ష మందికి పైగా ఉద్యోగాలను ఏకకాలంలో కల్పించి గ్రామీణ స్థాయిలో ప్రజల ఆర్థిక స్థితిగతులను మార్చేందుకు సీఎం జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా 536కు పైగా సేవలను అందించడం జరుగతోందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా అత్యంత పారదర్శకంగా అన్ని సంక్షేమ అభివద్ధి పథకాలు అర్హులందరికీ చేర్చడం జరుగుతోందన్నారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలు ఈ వ్యవస్థ పని తీరును పరిశీలించడం జరిగిందన్నారు. సీఈఓ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో సేవలు అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు సుస్థిరాభివృద్ధి సూచికలు, డిజిటలైజేషన్, సర్వీస్ రూల్స్ గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. క్షేత్ర స్థాయిలో మరిన్ని కార్యక్రమాలు చేపట్టేందుకు ఇటువంటి అవగాహన కార్యక్రమాలు అవసరమన్నారు. టిసిఐఎల్ కార్యదర్శి లలితమ్మ మాట్లాడుతూ నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులకు డిజిటలైజేషన్, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు, పేదరికం రూపుమాపేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి, సర్వీస్ రూల్స్ గురించి అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. సచివాలయ ఉద్యోగుల అందరికీ ఈ కార్యక్రమాన్ని మరో 52 రోజులపాటు వివిధ ప్రాంతాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని 31 మండలాల నుంచి పలువురు సచివాలయ కార్యదర్శులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు కొమ్ముకాస్తారా..?
ఆసుపత్రిపై పేదల ఆశలు ఆవిరి చేస్తారా.?

- చిత్తూరు ప్రధాన ఆసుపత్రిని ప్రైవేటుపరం చేసే ప్రయత్నాలు మానుకోవాలి
- ఆసుపత్రిని మెడికల్ కాలేజీగా మార్చు చేయాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు డిమాండ్

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: చిత్తూరు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని పూర్తిగా ప్రైవేటుపరం చేసే ప్రయత్నాన్ని ప్రభుత్వం మానుకోవాలని అఖిలపక్ష నాయకులు, ప్రజాసంఘ నేతలు డిమాండ్ చేశారు. సోమవారం నగరం లోని జనసేనపార్టీ కార్యాలయంలో అఖిల పక్ష పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జనసేన నాయకులు యశ్వంత్ అధ్యక్షతన నిర్వహిం చారు. సమావేశంలో సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి యస్.నాగరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు, జనసేనపార్టీ జిల్లా నాయకులు ఎన్.దయారాం, బహు జన సమాజ్ పార్టీ నాయకులు లోకనాదం, లోక్‌సత్తా పార్టీ నాయకులు రాంబాబులు మాట్లాడుతూ చిత్తూరు ప్రభుత్వం ప్రధాన అస్పత్రిని ఇప్పటికే లీజుకు ఇవ్వడమే కాకుండా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని కూడా పూర్తిగా కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పి ప్రయత్నాలు చేస్తున్నట్లు మండిపడ్డారు. పేద సామాన్య, మధ్య తరగతి ప్రజలకు వైద్యం సౌకర్యన్ని ప్రభుత్వం దూరం చేసు_న్నదని ధ్వజమెత్తారు. ప్రభుత్వ ఆసుపత్రిని ప్రైవేట్ పరం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. చిత్తూరు ప్రభుత్వ ఆసు ౖత్రిని రాష్ట్ర ప్రభుత్వం కొనసాగించాలని, అలాగే చిత్తూరు జిల్లాలో ఉన్నటువంటి ఏకైక ప్రభుత్వ ఆసుపత్రిని తరలించ కుండా ప్రభుత్వ మెడికల్ కాలేజీగా మార్పు చేయాలని డిమాండ్ చేశారు. చిత్తూరు జిల్లా ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చిన ఎంపీ, ఎమ్మెల్యేలు, మంత్రులు చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిని ప్రభుత్వమే కొన సాగించే విధంగా పేద సామాన్య మధ్య తరగతి ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యం అందించాలని కోరారు. చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిపై రేపు అమరావతిలో జరుగు తున్న సమావేశంలో చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిన్ని రాష్ట్ర ప్రభుత్వమే కొనసా గించే విధంగా నిర్ణయాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మంగళవారం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి ముందు అఖిలపక్ష పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం చేపట్ట నున్నట్లు స్పష్టం చేశారు. సమావేశంలో సిపిఐ నగర కార్యదర్శి గోపీనాథ్, ఏఐటీయూసీ నాయకులు దాసరి చంద్ర, ప్రజాసంఘాల నాయకులు కే.మణి, ప్రజా నాట్య మండలి జిల్లా నాయకులు ఎం. సుబ్రహ్మణ్యం, ఎస్.గురప్ప, మహిళా సమాఖ్య జిల్లా నాయకులు కే.విజయ గౌరీ, దళిత సంఘాల ఐక్యవేదిక నాయకు లు ధనుంజయ, జనసేన నాయకులు లో చన్, పుష్ప, వెంకటేష్, మహిళా సమైక్య న గర నాయకులు జమీలాబీ, కుమారి, కోమ ల, ఏఐవైఎఫ్ నాయకులు బాలాజీ రావు, రమేష ్‌బాబు, జయశంకర్, రిషికేశవ పాల్గొన్నారు.

భూ ఆక్రమణ ప్రశ్నిస్తే.. సర్పంచ్ భర్త దాదాగిరి.!

- చిన్న గొల్లపల్లి గ్రామస్తుల ఆరోపణ
- టీడీపీ, జనసేన నేతలను వెంటబెట్టుకొని తహశీల్దార్ కార్యాలయం ముట్టడి
- 6ఎకరాల పశువుల మేత భూమిని కబ్జా చేశారంటూ మండిపాటు
- రెండేళ్లుగా ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోరా అంటూ అధికారులను నిలదీత
- ఆక్రమిత భూమిని స్వాధీనం చేసుకోకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరిక

తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న చిన్నగొల్లపల్లి గ్రామస్తులు, నేతలు

ప్రజాశక్తి-గుడుపల్లి: ఆరు ఎకరాల ప్రభుత్వ పశువులు మేత బీడు భూమిని అక్కడి సర్పంచ్ భర్త ఆక్రమించుకున్నాడు. ఇందేంటని ప్రశ్నించిన స్థానికులపై దాదాగిరి చేశారు. చేసేది లేక అధికారులను ఆశ్రయిస్తే అధికార పార్టీ కావడంతో ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో గ్రామస్తులు ప్రతిపక్ష పార్టీలు టీడీపీ, జనసేన నేతలను వెంటబెట్టుకొని సోమవారం తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెలితే.. మండలంలోని పెద్దగొల్లపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని చిన్న గొల్లపల్లి పంచాయతీలోని సర్వే నెంబర్ 1.1లో సుమారు 6 ఎకరాల ప్రభుత్వ పశువుల బీడు భూమిని సర్పంచ్ రుక్మిణీ, ఆనంద్ కబ్జాచేశారని గ్రామస్తులు ఆరోపించారు. సోమవారం టీడీపీ, జనసేన నాయకులను వెంటబెటుకొని తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. రెండేళ్లుగా భూ ఆక్రమణపై అనేక సార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఎందుకు పట్టించుకోలేదంటూ నిలదీశారు. రెవెన్యూ అధికారుల పూర్తి సహకారంతోనే సర్పంచ్, భర్త భూ కబ్జాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రజా అవసరాలకు ఉపయోగపడుతున్న భూమిని ఆక్రమించుకున్న సర్పంచ్ భర్తను ప్రశ్నిస్తే "ప్రభుత్వం మాది చేతనైంది చేసుకోండి" అంటూ దాదాగిరి చేస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అటు గ్రామస్తులు, ప్రతిపక్ష నేతలు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగడంతో అధికారులు ఒకింత ఉక్కిరిబిక్కిరయ్యారు. ఆఖరికి సానుకూలంగా గ్రామస్తులు, నేతలకు మాట్లాడి భూ ఆక్రమణపై చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇవ్వడంతో నిరసన విరమించుకున్నారు. రెండు రోజుల్లో చర్యలు లేకుండా ఆందోళన మరింత ఉధృతం చేస్తామని అధికారులను హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు టి.ఎం బాబునాయుడు, చంద్రశేఖర్, బేటప్పనాయుడు, హేమాంబ గౌడు, సుబ్రమణి, నరేష్, అమీర్, గణేష్, సర్పంచ్ నారాయణ, విజయ్‌కుమార్, రామయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

లోకేష్‌ని కలిసిన సుధాకర్‌నాయుడు

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను గంగాధరం నెల్లూరుకు చెందిన టిఎన్ఎస్ఎఫ్ కార్యనిర్వాహక కార్య దర్శి సుధాకర్ నాయుడు కలిశారు. పెందుర్తి నియోజకవర్గంలో జరుగు తున్న యువగళం పాద్రయాత్రలో ఆయన కలిశారు. పలు రాజకీయపరమైన అంశాలను చర్చించినట్లు సుధాకర్ తెలిపారు.

చంద్రబాబు సీఎం కావాలి..

టెంకాయలు కొట్టి టీడీపీ శ్రేణుల పూజలు

ప్రజాశక్తి-గుడుపల్లి: చంద్రబాబు ఈ దఫా సీఎం కావాలని పార్టీ శ్రేణులు సోమవారం మల్లప్ప దేవాలయం వద్ద టెంకాయలు కొట్టారు. స్వామివారికి అభిషేకం నిర్వహించారు. ఆలయంలో అన్న ప్రసాదాలు పంచారు. కార్యక్రమంలో నాయకులు బాబునాయుడు, చంద్రశేఖర్, సుబ్రమణి, బెటప్పనాయుడు, హేమంబార్‌గౌడు, బాబు, అరుణాచలం, ప్రకాష్, మంజు పాల్గొన్నారు.

విద్యార్థికి వినికిడి యంత్రం పంపిణీ

ప్రజాశక్తి-నగరి: విజయపురం మండలం ఎం.అగరం గ్రామానికి చెందిన బాలకృష్ణనాయుడు కుమారుడు 10వ తరగతి చదువుతున్న పి.యోగి కుమార్‌కు వినికిడి యంత్రం ఏర్పాటుకు సీఎం సహాయనిధి నుంచి రూ.రెండు లక్షలు మంజూరైంది. విద్యార్థికి వినికిడి సమస్య తీవ్రంగా ఉండటంతో సర్జరీ ద్వారా వినికిడి యంత్రం అమర్చాలని వైద్యులు సూచించారు. అయితే సర్జరీకి లక్షల్లో ఖర్చవుతుందన్నారు. దీంతో మంత్రి ఆర్కేరోజాను సంప్రదించగా విద్యార్థికి వినికిడి యంత్రాన్ని సమకూర్చారు.

ఘనంగా పెన్షనర్స్ డే

ప్రజాశక్తి-నగరి: పట్టణ పరిధిలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో సోమవారం పెన్షనర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు జయచంద్రుడు, కార్యదర్శి ఓ.బాలసుబ్రమణ్యం పెన్షనర్స్‌డే ప్రాముఖ్యతను తెలుపుతూ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నగరి, విజయపురం, నింద్ర, పిచ్చాటూరు మండలాలకు చెందిన పలువురు పెన్షనర్లు ఈ సంఘంలో ఉన్నారన్నారు. కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన ఉపఖజానా అధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ లైఫ్ సర్టిఫికేట్లు తీసివ్వడంలోను, పెన్షన్ సంబంధిత సమస్యలు పరిష్కరించుకోవడంలోను పెన్షనర్ల సంఘం తమకంటూ ప్రత్యేకతను చాటుకుంటోందన్నారు. కార్యక్రమంలో బి.భాస్కరన్, సరస్వతి, నిర్మల, రాజగోపాలరాజు, డాక్టర్ రామచంద్రన్, వెంకటరమణా రెడ్డి, చెంగారెడ్డి, గురురాజారావు, శ్రీదేవి, ఎంఈవో హరిప్రసాద్ వర్మ పాల్గొన్నారు.

బంగారమ్మకు వెండి పాదుకలు వితరణ

ప్రజాశక్తి-కార్వేటినగరం: బంగారమ్మ జాతర సంభరాల్లో భాగంగా సోమవారం పోస్టాఫీసు గోపాల్ కుటుంబ సభ్యులు అమ్మవారికి రూ.80 వేలు విలువ జేసే వెండి పాదుకలను ఎంపీపీ లతబాలాజీ ఆధ్వర్యంలో ఆలయ అధ్యక్షుడు కే.ప్రసాద్‌కు అందించారు. ఆలయ అధ్యక్షుడు మాట్లాడుతూ బంగారమ్మ జాతరలో భాగంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించి కానుకలు సమర్పిస్తున్నారని తెలిపారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు చేపట్టి భక్తులకు తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు భాస్కర్, సాయి. స్థానిక సర్పంచ్ ధనంజయవర్మ, ఆలయ ఉపాధ్యాక్షుడు రంగనాథమొదలి, కార్యదర్శి చంద్రశేఖర్ పిళ్లై. భక్తులు పాల్గొన్నారు.

లింగ వివక్షను రూపుమాపాలి : సీఐ

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: లింగ వివక్షణ రూపుమాపాలని సిఐ నాగరాజు అన్నారు. సోమవారం మండల వెలుగు కార్యాలయంలో గ్రామ సమాఖ్య సభ్యులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిఐ నాగరాజురావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో లింగ వివక్షను చూపురాదని అదేవిధంగా బాల్య వివాహాలు గ్రామంలో అక్రమ మద్యం విక్రియాలు చేపట్టరాదని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏపిఎం మీరాబాయి, కమల, జిఎంఎస్‌కేలు, గ్రామ సమైక్య సభ్యులు పాల్గొన్నారు.

ఏపీ ఎరుకల సంఘం

రాష్ట్ర కార్యదర్శిగా శివశంకర్

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ఏపీ ఎరుకల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా శివశంకర్ ను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గంలో తనకు అవకాశం కల్పించిన ఏపీ ఎరుకల సంఘం అధ్యక్షులు పాలపర్తి శ్రీనివాస చక్రవర్తికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఏపీలో ఎరుకల హక్కుల పరిరక్షణకు తనవంతు కృషిచేసి సంఘాన్ని, కులాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఆయన స్పష్టం చేశారు.

మహిళలకు చేతి వృత్తులపై అవగాహన అవసరం

- రాజమండ్రి కాయర్ బోర్డు రీజనల్ ఆఫీసర్ యేసుదాస్

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: చేతి వృత్తుల ద్వారానే మహిళలు స్వయం శక్తితో నిలబడి ఆర్థికంగా రాణించగలరని రాజమండ్రి కాయర్ బోర్డ్ రీజనల్ ఆఫీసర్ యేసుదాస్ అన్నారు. పాలసముద్రం మండలం కృష్ణజిమాపురం చెందిన రూరల్ అక్షన్ ఫర్ సోషియల్ సర్వీసెస్ సమస్త ప్రధాన కార్యదర్శి పాపులూరి చిట్టిబాబు ఆధ్వర్యంలో గంగాధర నెల్లూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీసులో సోమవారం 60 మంది మహిళలకు కొబ్బరి పీచుతో దారాలు, మ్యాట్లు, తయారీపై వివిధ అంశాలపై శిక్షణ కార్యక్రమంలో వివరించారు. ఏసుదాసు మాట్లాడుతూ గతంలో గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు కేవలం వంటింటికే పరిమితమై ఉండేవారని మారుతున్న కాలానుగుణంగా మహిళల్లో ఆలోచన పెంపొంది కుటుంబానికి ఆర్థికభివృద్ధికి వారి వంతు పాత్ర వహిస్తున్నారని తెలిపారు. జిల్లా పరిశ్రమల కేంద్ర అధికారి కృష్ణ కిషోర్ మాట్లాడుతూ పిఎం ఈజీపి ద్వారా మహిళలు రుణాలు తీసుకుని చేతివృత్తుల ద్వారా తయారు చేసే వస్తువులు వ్యాపారాన్ని విస్తరించుకుని ఆదాయం గడించవచ్చునని చెప్పారు. డిఆర్‌డిఏ ప్రోగ్రాం అధికారిని నీరజ మాట్లాడుతూ చేతివృత్తుల శిక్షణ తీసుకున్న మహిళలు చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసి మరికొంతమంది మహిళలకు ఉపాధి కల్పించాలని పిలుపునిచ్చారు. రూరల్ అక్షన్ ఫర్ సోషల్ సర్వీస్ సంస్థ ప్రధాన కార్యదర్శి పాపులూరి చిట్టిబాబు మాట్లాడుతూ గంగాధర నెల్లూరు మండలంలో వివిధ గ్రామాల్లో కొబ్బరి పీచుతో దారాలు, మ్యాట్లు, తయారు శిక్షణను 200 మంది మహిళలకు ఇప్పటివరకు ఇప్పించామన్నారు. కార్యక్రమంలో నెహ్రూ కేంద్రం కోఆర్డినేటర్ ప్రదీప్, గంగాధర్ నెల్లూరు కెనరా బ్యాంక్ మేనేజర్ వెంకటరమణ, ఇండియన్ బ్యాంక్ మేనేజర్ విజయ్ కుమార్ శెట్టి, వేల్కార్ క్రాస్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు భూపతి, ఏపిఎం చిరంజీవి, అక్కనగారిపల్లె పాఠశాల హెచ్ఎం గంగాధరం, శిక్షణ అధికారులు పుష్పలత, దివ్య, స్వరూప, మహిళలు పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సును విజయవంతం చేయండి : ఆశా వర్కర్స్ యూనియన్

ప్రజాశక్తి-నగరి: ఆశ కార్మికుల సమస్యల పరిష్కారానికి, జీతాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ డిసెంబర్ 21వ తేదీన విజయవాడలో జరుగు రాష్ట్ర స్థాయి సదస్సును జయప్రదం చేయాలని ఆశ వర్కర్స్‌కు ఆశ వర్కర్స్ జిల్లా గౌరవ అధ్యక్షులుటి కోదండయ్య, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి చెందమరైలు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆశ వర్కర్స్ యూనియన్ ముఖ్యుల సమావేశం యూనియన్ జిల్లా నాయకురాలు ఉషారాణి అధ్యక్షతన జరిగింది. ఆశా కార్మికుల సమస్యల పరిష్కరించి వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించి పని భారం తగ్గించాలని, అనేక డిమాండ్లతో ప్రభుత్వాన్ని కోరుతున్నా స్పందించలేదన్నారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కోదండయ్య ఆశ వర్కర్స్ యూనియన్, జిల్లా ప్రధాన కార్యదర్శి చందామరైలు వేర్వేరుగా మాట్లాడుతూ ఆశా కార్మికులుకు ఎన్నో సమస్యలు ఉన్నప్పటికీ గ్రామస్థాయిలో, పట్టణాల్లో ప్రతి ఇంటికి తిరిగి ప్రజల అనారోగ్యం బారిన పడకుండా అప్రమత్తం చేస్తూ వున్నారని, గర్భవతుల్ని సంరక్షిస్తూ, తల్లి బిడ్డలను క్షేమంగా చూసుకుంటూ ఆశాలు నిరంతరం రేయి పగులు పనిచేస్తున్నారన్నారు. 2017 నుంచి లెప్రసీ, టి.బి, సర్వే చేసిన డబ్బులు కూడా బకాయిలు ఉన్నాయని, ఆశా కార్యకర్తలకు సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని, ఉద్యోగ భద్రత కల్పించి పనిభారాన్ని తగ్గించాలని, ఇలా అనేక డిమాండ్లతో పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 21వ తేదీన ఏఐటియుసి ఆధ్వర్యంలో ఆశా వర్కర్స్ అందరూ విజయవాడలో జరుగు రాష్ట్ర సదస్సును పెద్ద ఎత్తున పాల్గొనాలని విజయ వంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఉషారాణి, బిందు, కవిత, మీనా, గీత పాల్గొన్నారు.

ఓటరు దరాఖాస్తులు క్షుణ్ణంగా పరిశీలించండి : జెడ్పీ సీఈవో

ప్రజాశక్తి-సోమల: ఓటరు దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని జెడ్పి సీఈవో ప్రభాకర్‌రెడ్డి బీఎల్‌వోలను ఆదేశించారు. సోమవారం సోమల తహసిల్దార్ కార్యాలయంలో ఎంపీడీవో, బిఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తులలో నమోదు చేసిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడాలని సూచించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశపు మందిరాన్ని పరిశీలించి సమావేశ మందిరాన్ని మరమ్మతులు చేయించాలని కోరారు. అనంతరం కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్యాంప్రసాద్‌రెడ్డి, ఎంపీడీవో నాగరాజు, ఈఓఆర్‌డి లక్ష్మీదేవి, పిఆర్ జెఈ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థ పరిధిలో ఇటీవల కాలంలో మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు చేపట్టడం కోసం కమిషనర్ డా.జె.అరుణ సోమవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. నగరపాలక సంస్థ పరిధిలో వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తూ ఆరుగురు మృతి చెందారు. వీరి కుటుంబ సభ్యుల దరఖాస్తుల మేరకు అర్హులైన కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల కోసం కమిషనర్ ఆధ్వర్యంలో సర్టిఫికెట్ల పరిశీలించారు. దరఖాస్తులు, వారి విద్యార్హత ధ్రువీకరణ పత్రాలను తనిఖీ చేశారు. కుటుంబ సభ్యుల వివరాలను పరిశీలించి నియామకాల కోసం ఆప్షన్లు తీసుకున్నారు. అభ్యర్థుల విద్యార్హతల మేరకు నగరపాలక సంస్థ పరిధిలో అందుబాటులో ఉన్న పోస్టుల్లో నియామకాలు చేపట్టాలని, నియామక ఉత్తర్వులు జారీ చేయాలని కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంఈ గోమతి, ఎంహెచ్వో డా. లోకేష్, మేనేజర్ ఉమామహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యా, వైద్యానికి అత్యంత ప్రాధాన్యత: మంత్రి రోజా

ప్రజాశక్తి-నగరి: విద్యా, వైద్య రంగాలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని కొత్తపేట 12,13 వార్డుల్లో మంత్రి గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజా సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశం చారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పీజీ నీల మేఘం, వైస్‌చైర్మన్ బాలన్, రాష్ట్ర మొద లియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణన్, మున్సి పల్ పార్టీ అధ్యక్షులు బీఆర్వీ అయ్యప్పన్, మున్సి పల్ సచివాలయ కన్వీనర్ దయానిధి, కౌన్సిలర్లు చిత్ర, ఎంఎం కామాక్షి, మోహన్‌రాజ్, భూపా లన్, ఇంద్రయ్య, నాయకులు మనోహర్, ఇళం గో, సతీష్, జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా ఆరోగ్యానికి సీఎం జగన్ పెద్దపీట'



ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ప్రజా ఆరోగ్యానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని ఎంపీపీ అమరావతి అన్నారు. సోమవారం మండల కార్యాలయంలో నూతనంగా ఆరోగ్యశ్రీకి పెంపొందించిన నిధుల ఆవిష్కరించిన కార్యక్రమం టెలి కాన్ఫరెన్స్లో పాల్గొన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య ఖర్చులు రూ.25లక్షలకు పరిమితి పెంచుతూ తీసుకున్న నిర్ణయం హర్షించతగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో డిఎల్డిఓ ఉమావాని, ఇన్చార్జ్ ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. ఆ తరువాత మండలంలోని జిల్లేడుపల్లి సచివాలయంలో ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని సర్పంచ్ భారతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ, ఎంపీటీసీ శంకర్‌రెడ్డి, నాయకులు అశోక్‌రెడ్డి, అన్నామల్‌రెడ్డి, భాను, కిషోర్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

సదుం: ఆరోగ్య శ్రీ కార్డు వున్న ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల ఉచిత వైద్య సౌకర్యం కల్పిస్తున్నట్లు సీఎం జగన్మోహన్ రెడ్డి విసి కాన్ఫరెన్స్ ద్వారా తెలిపారని చదువు ఎంపీడీవో వరప్రసాద్ అన్నారు. సోమవారం సదుం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటుచేసిన సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎల్లప్ప, హాస్పిటల్ కమిటీ ఛైర్మన్ నాలికృష్ణారెడ్డి, ఎంపీడీవో వరప్రసాద్, సిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పుష్పలత, చెరుకువారిపల్లి పిహెచ్‌సి డాక్టర్ చరణ్, హెల్త్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ ఉదయ భాస్కర్, ఏపీవో శివశంకర్, జేసీఎస్ ఇంచార్జి నాలి ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

అయ్యోర్ల ఉద్యమ బాట

డీఆర్‌వోకి నోటీసు అందజేత

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ప్రతి నెలా ప్రతి నెల ఒకటో తేదీ జీతం ఇవ్వాలని ఉత్తర్వులు ఉన్నప్పటికీ గత రెండు సంవత్సరాలుగా ఆలస్యంగా జీతాలు జమ చేస్తున్న పరిస్థితి ఉందన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో డీఆర్‌వోకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పిఆర్సి ముందు ఉన్న డిఏల బకాయిలను పిఆర్సి తర్వాత ఇచ్చిన డిఏ బకాయిలతో పాటు జడ్పీపిఎఫ్, ఎపిజిఎల్ఐ, ఈఎల్ తదితర ఫైనల్ పేమెంట్లను వెంటనే చెల్లించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని, పలుమార్లు జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాలు సందర్భంగా తెలియజేశ్మాన్నారు. కానీ ఇందులో ఎలాంటి మార్పులు రాలేదన్నారు. ప్రభుత్వం తగు చర్యలు తీసుకోలేని పక్షంలో ఆందోళన బాట పట్టడానికి దశలవారీ కార్యక్రమాలకు పిలుపునిచ్చినట్లు తెలిపారు.

కార్యచరణ ఇలా...

- 18వ తేదీన జిల్లా కలెక్టర్లకు నోటీసులు
- 19, 20, 21న అందరు శాసనసభ్యులకు, మంత్రులకు విజ్ఞాపనలు
- 27న తాలూకా, డివిజన్ కేంద్రాల్లో 6గంటల ధర్నాలు
- జనవరి 3న జిల్లా కేంద్రాల్లో 12 గంటల ధర్నాలు
- జనవరి 7, 8 తేదీల్లో రాష్ట్ర కేంద్రంలో 36 గంటల ధర్నాలు చేపట్టనున్నట్లు వివరించారు.

కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జీవి.రమణ, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్ నాయుడు, మనిగండన్, అసోసియేట్ అధ్యక్షురాలు రహన బేగం, స్టేట్ కౌన్సిలర్ బాషా, జిల్లా కార్యదర్శులు రెడ్డెప్ప నాయుడు, సరిత, సురేష్, గణేష్‌కుమార్ పాల్గొన్నారు.

యువగళం ముగింపు సభకు ప్రత్యేక రైలు

ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్: విజయనగరం జిల్లా భోగాపురం మండలం పోలిపల్లి వద్ద ముగియనున్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర ముగింపు విజయోత్సవ సభకు భారీగా శ్రేణులు తరలివెళ్లనున్నట్లు జి.జె.యం చారిటబుల్ ఫౌండేషన్ ఛైర్మెన్ గురజాల జగన్‌మోహన్ తెలిపారు. ఈనెల19న మంగళవారం ఉదయం 11.00 గంటలకు చిత్తూరు నగరం నుండి ప్రత్యేక రైలు బయలుదేరుత్నునట్లు చెప్పారు. చిత్తూరు పార్లమెంటు పరిధిలోని నియోజకవర్గాలకు చిత్తూరు రైల్వేస్టేషన్, చంద్రగిరి నియోజకవర్గానికి పాకాల రైల్వే స్టేషన్, రేణిగుంట రైల్వే స్టేషన్ నుంచి ముగింపు సభాస్థలి విజయనగరం వరకు 18 బోగిలుతో కూడిన ప్రత్యేక రైలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని వసతులతో రైలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు అందరూ 20 నాడు జరిగే యువగళం ముగింపు విజయోత్సవ సభకు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. తిరిగి అదే రైలులో గురువారం నాడు 21ఉదయం 12.30కి విజయనగరం నుండి తిరుగు ప్రయాణంలో సురక్షితంగా మీ గమ్యస్థానాలకు చేరుకోవాలని విజ్ఞప్తి చేశారు.

తుపాను బాధితులకు ఫిన్‌కేర్ సాయం

ప్రజాశక్తి-చితూరుఅర్బన్: తుఫాను బాధితులకు ఫిన్‌కేర్ బ్యాంకు నిత్యవసర సరుకులు పంపిణీ చేసి దాతృత్వాన్ని చాటుకుంది. శ్రీకాళహస్తి, నాయుడుపేట, పిచ్చాటూరు మండలాల్లో బ్యాంకు వంతున ఆహార ధాన్యాలు పంపిణీ చేశారు. బియ్యం, పప్పు నూనె, మసాలా దినుసులు, సాల్టు ఇలాంటి వస్తువులు ప్రతి కుటుంబానికి రూ.500 విలువైన కిట్లు అందజేశారు. కార్యక్రమానికి బ్రాంచ్ రీజనల్ మేనేజరు శేషాద్రి, సెంట్రల్ మేనేజర్ ప్రత్యేక ఆహ్వానితులుగా జోనల్ హెడ్ డీజీఎం వెంకట స్వామి హాజరైయ్యారు.

పాఠశాలకు అవార్డు రావడం గర్వకారణం

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మదర్ థెరీసా పాఠశాలకు అత్యంత వినూత్నమైన పాఠశాలగా గుర్తింపు పొంది అవార్డు రావడం పాఠశాలకు గర్వకారణం అని మదర్ తెరిసా విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎం.రవీంద్రబాబు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2023 సంవత్సరానికి బ్రెయిన్ ఫీడ్ హైదరాబాదు వారు భారతదేశంలో కెల్లా వినూత్నమైన విద్యా బోధన మొదలగు అంశాలను పరిగణలోకి తీసుకోని ఉత్తమ అవార్డులు ప్రధాన కార్యక్రమం నిర్వహించిందని తెలిపారు. భారతదేశంలోని 500 పాఠశాలలు పాల్గొనగా, మదర్ థెరిసా విద్యాసంస్థల యాజమాన్యం ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామీణ విద్యార్థుల సౌకర్యం కొరకు అధునాతన, సాంకేతిక హంగులతో విద్యా బోధన చేపడుతున్న మదర్ థెరీసా సిబిఎస్ఈ పాఠశాల భారతదేశంలోని అత్యంత వినూత్నమైన పాఠశాలగా గుర్తింపును పొందిందన్నారు. పాఠశాల తరపున ఛైర్మన్ సునీల్ ఈ అవార్డును అందుకున్నారని తెలిపారు. పాఠశాలకు అవార్డు రావడం ప్రిన్సిపాల్ డేవిడ్ హర్షం వ్యక్తం చేశారు.

దీవెన బకాయిలు ఇవ్వండి.!

- కలెక్టరేట్ ఎదుట టీఎన్ఎస్ఎఫ్ నాయకులు ధర్నా

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: విద్యార్థులకు జమ చేయవలసిన విద్యా దీవెన, వసతి దీవన బకాయిలు వెంటనే విడుదల చేయాలని టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు ప్రభు తేజ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట తెలుగునాడు విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో బకాయిలు విడుదల చేయాలని ధర్నా చేపట్టారు. అనంతరం డిఆర్ఓకి వినతిపత్రం అందజేశారు. జగన్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి నాలుగేళ్లలో విద్యార్థికి తీరని లోటు నష్టం ఏర్పడిందన్నారు. ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు గత ప్రభుత్వంలో ప్రతి ఏడాది స్కాలర్షిప్ లేదా ఫీజు మెంబర్స్ ద్వారా కాలేజీ యజమాని ఖాతాలో పడుతున్నదన్నారు. కానీ ఈ ప్రభుత్వంలో కేవలం ఒకరికి మాత్రమే అమ్మ ఒడి పేరుతో వాంఛన వేయడం దారుణం. డిగ్రీ, ఇంజినీరింగ్, నర్సింగ్ డిప్లమో, ఐటిఐ చదువుతున్న విద్యార్థులకు గత ప్రభుత్వంలో డైరెక్ట్ కాలేజ్ మేనేజ్మెంట్ ఖాతాలోకి డబ్బులు జమ అవుతున్న నేపథ్యంలో, జగన్‌రెడ్డి ప్రభుత్వం సుమారు నాలుగేళ్లలో నాలుగు విడతల బకాయిలు ఇంకా జమకాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

క్రైం కార్నర్

వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి-కార్వేటినగరం: టాటా ఏసీ వాహనం ఢీ కొని వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన పద్మసరస్సు సమీపంలో చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిపై సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా.. మేజర్ పంచాయతీ కార్వేటినగరం కోటదళితవాడకు చెందిన శేఖర్(32) తమ గ్రామం నుంచి సొంతపనుల నిమిత్తం పద్మసరస్సుకు ద్విచక్రవాహనం వెళుతూ, పుత్తూరు నుంచి వస్తున్న టాటా ఏసీ వాహనం వేగంగా వచ్చి ఢీకొనడంతో శేఖర్ తలపై తీవ్రగాయాలయ్యాయి. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద జరిగిన తీరును పరిశీలించి గాయపడిన వ్యక్తిని ప్రైవేటు వాహనం ద్వారా పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అలాగే ఢీకొన్న టాటా ఏసీతో పాటు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ దస్తగిరి తెలిపారు.

మద్యం విక్రేత అరెస్ట్

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: కర్నాటక నుంచి మద్యం తెచ్చి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఈబీ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని మొగిలి వెంకటగిరి గ్రామంలో తనిఖీలు నిర్వహించామన్నారు. అదే గ్రామానికి చెందిన బాలకృష్ణ కర్నాటక 144 టెట్రా ప్యాకెట్లు, 38లీటర్ల మద్యాన్ని కలిగి ఉండడాన్ని గుర్తించి అదుపులోకి తీసుకున్నామన్నారు. కొంతకాలంగా మద్యం విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో పోలీసులు శ్రీరామ్, మోహన్‌బాబు, సుబ్రహ్మణ్యం, కిరణ్‌కుమార్, వెంకటేష్, మమత, చంద్రకళ, మోహన్ పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

శ్రీ వి.వెంకటేశ్వర రెడ్డి అను వారికి సర్వే నెంబర్ 714, సురేంద్రనగరం గ్రామము, కార్వేటినగరం మండలం, చిత్తూరు జిల్లా నందు 2.00 హెక్టర్స్‌లో కలర్ గ్రానైట్ మైన్ కు స్టేట్ లెవెల్ ఎన్విరాన్మెంట్ ఇంపాక్ట్ అస్సెమెంట్ అథారిటీ (SEIAA), ఆంధ్రప్రదేశ్ నుండి పర్యావరణ అనుమతి పొందినారు. దీనికి సంబంధించిన అనుమతి పత్రములు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రం మండలి వద్ద మరియు వారి వెబ్‌సైట్ www.appcb.ap.nic.in లోను పొందుపర్చబడమైనది. ఆర్డర్ SEIAA/AP/CTR/MIN/01/2019/816, Dt.03.05.2019.